ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర
సంపుటి : 13
సంచిక : 343
పేజీలు : 5 వెల రూ. 2/-
బుధవారం
29 ఏప్రిల్ 2026
PUBLISHED FROM :
HYDERABAD

AM న్యూస్
ప్రతిదినం ప్రత్యేకం
www.amnews7.com

# నేడు తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల

**ఏఎం న్యూస్, హైదరాబాద్,ఏప్రిల్ 28 :** తెలంగాణలో పదో తరగతి పరీక్షా ఫలితాల విడుదలకు ముహూర్తం ఖరారైంది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఫలితాలు వెల్లడించనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం వెల్లడించింది. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు ఫలితాలను విడుదల చేయనున్నట్లు సమాచారం. మార్చి 14 నుంచి ప్రారంభమైన ప్రధాన పరీక్షలు ఈ నెల 13న పూర్తయ్యాయి. సుమారు 5.15 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ నెల 23వ తేదీతో జవాబుపత్రాల మూల్యాంకనం పూర్తయింది. మే మొదటి వారంలో ఫలితాలు విడుదల చేస్తామని ముందు నుంచి చెబుతున్నా... తాజాగా ఈనెల 29న విడుదల చేసేందుకు రంగం సిద్ధమైంది. దీంతో పరీక్షల విభాగం అన్ని ఏర్పాట్లు చేసింది.

## మహిళా బిల్లును ఆమోదించి తీరుతాం

- 40 ఏళ్లుగా విపక్షాలు అడ్డుకుంటూనే ఉన్నాయి..
- వారణాసిలో ప్రధాని మోడీ
- మోదీ గ్యాంగ్‌టక్‌లో సందడి
- సిక్కిం ఆవిర్భావ దినోత్సవం
- పిల్లలతో కలిసి ఫుట్‌బాల్ ఆడిన ప్రధాని

2 లో



# ఫ్యూచర్ కోసమే.. సిటీ నిర్మాణం

- ప్రపంచ దేశాలకు ధీటుగా నగర ప్రణాళిక
- 60 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణం
- ఓఆర్ఆర్ పెద్ద అసెట్ కానుంది
- అంతర్జాతీయ స్థాయి బస్ టెర్మినల్
- మెట్రో విస్తరణతో అద్భుత కనెక్టివిటీ
- గ్రామాల ప్రజలు సిటీలో భాగం కావాలి
- ప్రజాప్రతినిధులు సిటీ కోసం కృషి చేయాలి
- మూడు బుల్లెట్ ట్రైన్స్ కేంద్రంగా శంషాబాద్
- ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ నిర్మాణానికి సిఎం రేవంత్ శంకుస్థాపన



**ఏఎం న్యూస్, హైదరాబాద్,ఏప్రిల్28:** ఫ్యూచర్ సిటీ భవిష్యత్ తరాలకు వరమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందరి కృషితోనే ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఈ సిటీ నిర్మాణం అంత సులభం కాదన్నారు. అయితే పక్కా ప్రణాళికతో ప్రపంచ నగరాలకు దీటుగా నిర్మించబోతున్నామని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసే నగరంలో తమనూ కలపాలని స్థానిక గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారని వెల్లడించారు. ప్రజల్ని అభివృద్ధిలో భాగస్వాములు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ చెప్పుకొచ్చారు. రంగారెడ్డి జిల్లా మీర్ఖాన్‌పేట్‌లో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ శంకుస్థాపన చేశారు. అలాగే పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మల్కాజ్‌గిరి కమిషనరేట్ భవనం, ఆక్టోపస్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, కుత్బుల్లాపూర్ డీసీపీ కార్యాలయాలను ప్రారంభించారు. గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికీ సీఎం రేవంత్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో చాలా మంది నేతలు హైదరాబాద్ అభివృద్ధిని కొనసాగించారని చెప్పారు. ఇప్పుడు నాలుగో నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు. జపాన్, జర్మనీ, సింగపూర్ వంటి దేశాల్లోని అత్యాధునిక నగరాల తరహాలో, భారత్‌లోనే నాలుగో నగరంగా దీన్ని తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. 60 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణం జరుగుతోందన్నారు. మనకున్న అద్భుతమైన ఆర్ఆర్ఆర్, ఐటీ ఎగుమతులు, కోవిడ్ వ్యాక్సిన్ తయారీలో మన ఘనతలే ఈ నగరానికి స్ఫూర్తి అని తెలిపారు. ఫ్యూచర్ సిటీ కోసం భూములిచ్చిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. ఈ నగర నిర్మాణానికి మిగతా 2లో..

## ప్రపంచానికి సవాల్‌గా మారిన ఉగ్రవాదం

- ఉగ్రవాదానికి ఊతమిచ్చే దేశాలను తిప్పికొట్టాలి
- షాంఘై సహకార రక్షణ మంత్రుల సమావేశంలో రాజ్‌నాథ్ సింగ్

2 లో



## సిసి కెమరాలను సైతం హ్యాక్ చేస్తున్నారు

- అలాంటి పోలీస్ అధికారులను వదలం
- మాజీమంత్రి హరీష్ రావు హెచ్చరిక

2 లో



## చర్లపల్లి స్టేషన్ వద్ద భూమి కేటాయించండి

- సిఎం రేవంత్‌కు కిషన్ రెడ్డి లేఖ



2 లో

## నేడు బెంగాల్లో రెండోదశ పోలింగ్

- భారీగా ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం
- ఎన్ఐఎను అప్రమత్తం చేసిన ఇసి

## తెలంగాణలో పెరిగిన ఎండల తీవ్రత

- ఇప్పటికే వడదెబ్బకు ముగ్గురు మృతి
- దేశవ్యాప్తంగా కొనసాగుతున్న హీట్‌వేవ్
- భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం

2 లో



## తెలంగాణ డిజిపిగా సివి ఆనంద్

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

2 లో



# కొనసాగుతున్న శ్రీ నృసింహ జయంతి మహోత్సవములు

ఏఎం న్యూస్ / యాదగిరిగుట్ట :
శ్రీనృసింహ జయంతి మహోత్సవములు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉదయం శ్రీ స్వామివారి ఆలయంలో నిత్యారాధనల అనంతరము శ్రీనృసింహ జయంతి మహోత్సవ ములలో భాగంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి అలంకారసేవ, యాగశాల లో ద్వారతోరణపూజ, మూర్తికుంభారాధన చతు: స్థానార్చన, లక్ష్మీనృసింహసుదర్శన, గరుడమూలమంత్ర హోమ ములు నిత్య పూర్ణాహుతి వేడుకలను ఆలయప్రధానా ర్చకులు, ఉపప్రధానా ర్చకులు, యాజ్ఞికబృందం, అర్చకులు, వేదపండితులు పారాయణీకులు అత్యంతవైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలలో కార్య నిర్వహణాధికారి జె. భవానీ శంకర్ ఐ.ఏ.ఎస్., ఆలయ అనువంశీక ధర్మకర్త .బి. నరసింహమూర్తి, ఉపకార్యనిర్వహణాధికారి, సహాయకార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షకులు, ఉద్యోగ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. యాగశాలలో చతుస్థానముల యందు వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ అధిష్టాన స్వరూపములైన దేవతలను ప్రతిరోజు షోడశోపచారములతో ఆరాధన గావించి ఫల నైవేద్యములను సమర్పించారు.
చతు: స్థానార్చనలతో భగవానుడు సంతృప్తి పొంది అనుగ్రహించునని, ఉత్సవములలో ఈ వేడుక నిర్వహించెదరు.
సాయంకాలము శ్రీ స్వామివారి ఆలయములో నిత్యారాధనల అనంతరము శ్రీనృసింహజయంతి మహోత్సవములలో భాగంగా గరుడవాహనముపై పరవాసుదేవ అలంకార పురవీధి శేవ సాయ



మారాధన, ద్వారతోరణపూజ, చతు:స్థానార్చన, లక్ష్మీనృసింహ సుదర్శన, గరుడమూలమంత్ర హవనములు, నిత్యపూర్ణాహుతి నిర్వహించారు. శ్రీ పాంచరాత్రాగమ శాస్త్రానుసారముగా భగవానుడి మూల తత్వమైన పరవాసుదేవ అలంకార శేవ ఎన్నో ప్రత్యేకతలను కలిగియున్నది ఐదు విధములైన భగవంతుడి యొక్క దివ్య తత్వములలో ప్రధానమైనది పరతత్వం వాసుదేవ తత్వం, ఈ వైభవం పరమపదంలోని నిత్య సూరులు, ముక్తులు, ఆచార్య పురుషులు, నిత్యం సేవిస్తూ మహాదానందాన్ని అనుభవిస్తూ ఆ ఆనంద అమృత ప్రవాహంలో మునకలు వేస్తూ తరించే వైనం పరవాసు దేవతత్వంగా పేర్కొనబడుచున్నది. పరమపదానాథుడిగా అన్ని అవతారములకు మూలతత్వముగా ఆనంద స్వరూపుడిగా శ్రీ భూదేవి సమేతుడై మహదానందాన్ని లోకానికి పంచే అమృత రూపమే పరమపద నాధుని రూప సౌందర్యం, ఆ సౌందర్యాన్ని ఈనాటి అలంకార శేవలో దర్శింప చేస్తూ భక్తకోటిని తరింపచేయుట ఎంతో ప్రశస్తమై ఉన్నది.
శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయము, పాతగుట్ట.. శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయము, పాతగుట్ట నందు 27-04-2026 30-04-2026 ఉత్సవములు అత్యంత వైభవముగా నిర్వహింపబడుచున్నవి. అందులో భాగంగా తేదీ:28. 04. 2026న, ఉదయం: యాగశాలలోద్వారతోరణపూజ, మూర్తికుంభారాధన, లక్ష్మీ నృసింహసుదర్శన, గరుడమూల మంత్ర హోమములు, నిత్యపూర్ణాహుతి, లక్షకుంకుమార్చన నిర్వహిం చబడినవి. సాయంకాలము: సాయమారాధన, చతుస్థానార్చన, మూలమంత్ర హవములు, నిత్యపూర్ణాహుతి, మొదలగు యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి మహిళా భజనమండలి భాగ్యలక్ష్మీ మహిళా భజన మండలి డా.శ్రీమతి.వనజా ఉదయ్ శిష్య బృందం వారిచే కూచిపూడి నృత్యం నిర్వహించారు.



# ఫ్యూచర్ కోసమే...సిటీ నిర్మాణం

(మొదటిపేజీ తరువాయి)

సహకరించే వారు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. వచ్చే జూన్ నెలలో ఫ్యూచర్ సిటీ కార్యాలయాన్ని ప్రారంభించబోతున్నామని తెలిపారు. సిటీ నిర్మాణానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని.. ప్రపంచంతో పోటీపడేలా నిర్మిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూన్ 2వ తేదీ లోపు ఫ్యూచర్ సిటీ భవన నిర్మాణం జరుగుతుందన్నారు. గతంలో హైటెక్ సిటీ అంటే అవహేళన చేశారని.. ఏ నగరానికీ లేని ఔటర్ రింగ్ రోడ్డు హైదరాబాద్‌కు ఉందన్నారు. మూడు కొవిడ్ వ్యాక్సిన్లు తెలంగాణలోనే ఉత్పత్తి అయ్యాయని గుర్తు చేశారు. యుద్ధ విమాన సర్వీస్ సెంటర్లు హైదరాబాద్‌లో ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచంతో పోటీపడేటా ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఫ్యూచర్ సిటీ కేవలం ఒక నగరం కాదు, ఇది రాబోయే తరాల తలరాతను మార్చే అద్భుతమన్నారు. ఈ నగర నిర్మాణం అంత సులభం కాదు. ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజల భాగస్వామ్యం ఉంటేనే ఇది సాధ్యమవుతుంది. ఫ్యూచర్ సిటీలో కలవాలనుకునే గ్రామాలు... గ్రామ సభల్లో తీర్మానం చేసి ముందుకు రావాలని సీఎం పిలుపునిచ్చారు. ప్రజా ప్రతినిధులు ఫ్యూచర్‌సిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. భవిష్యత్ తరాలకు అద్భుత నగరంగా ఫ్యూచర్ సిటీ విలసిల్లుతుందన్నారు. ఫ్యూచర్ సిటీ పరిధి గ్రామాల సర్పంచ్‌ల వివరాలు తెప్పించుకోవాలి. తమ గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. ఆయా గ్రామాల్లో సభలు పెట్టి తీర్మానాలు చేసి.. కలెక్టర్, మంత్రికి పంపాలి. ఆయా గ్రామాలను ఫ్యూచర్ సిటీలో భాగం చేసే చర్యలు చేపడతాం.



ఆదర్శ నగరాలతో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దుతాం అని సీఎం అన్నారు. ఇకపోతే కేంద్రం దేశవ్యాప్తంగా ఏడు బులెట్ ట్రైన్లను ప్రకటిస్తే.. అందులో మూడు మన రాష్ట్రానికే రాబోతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. శంషాబాద్ కేంద్రంగా ముంబై, బెంగళూరు, అమరావతి నగరాలను అనుసంధానిస్తూ బులెట్ రైళ్లు పరుగులు తీయబోతున్నాయని చెప్పారు. కేవలం రైళ్లే కాదు.. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో భారీ బస్సు టెర్మినల్‌ను కూడా మనం నిర్మించుకోబోతున్నామని రేవంత్ తెలిపారు. మెట్రో, బులెట్ ట్రైన్, అత్యాధునిక బస్ టెర్మినల్.. ఇవన్నీ ఒకే చోట ఏర్పాటు కాబోతున్నాయన్నారు. త్వరలోనే రంగారెడ్డి జిల్లా ఒక మహా అద్భుతానికి సాక్ష్యం కాబోతోందని చెప్పారు. తాను కూడా ఈ గడ్డ నుండే ఊరికి వెళ్తాను.. అందుకే మీపై ఉన్న అభిమానంతో, ఈ ప్రాంత భవిష్యత్తు కోసం అద్భుతమైన ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని చెప్పారు. ఫ్యూచర్ లేనివాడు ఫ్యూచర్ సిటీ అంటున్నాడని కొందరు అంటున్నారు. నా మీద ఏడ్చే వారికి నేను చెప్పేది ఒక్కటే మీరు ఏడ్చుకుంటూనే ఉండండి, నేను నా పని చేసుకుంటూనే పోతా మీ ఏడుపే నాచెవులకు వినిపించే మధుర సంగీతం అని రేవంత్ అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు మహేందర్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎంపి వేం నరేందర్‌రెడ్డి, డిజిపి శిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

# తెలంగాణలో పెరిగిన ఎండల తీవ్రత

ఏఎం న్యూస్, హైదరాబాద్,ఏప్రిల్28:
తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఉష్ణోగ్రతలు భారీగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో బయటకు రావడం కష్టంగా మారింది. తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా 46 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఎండల తీవ్రత కారణంగా తెలంగాణలో విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. వడదెబ్బతో ముగ్గురు మృతి చెందగా, పిడుగుపాటుకు ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఇకపోతే దేశవ్యాప్తంగా హీట్‌వేవ్ కొనసాగుతున్నది. ఎండలు దంచికొడుతున్నాయి. చాలా చోట్ల అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి, కొన్ని చోట్ల వరుసగా గత కొన్ని రోజుల నుంచి ఎండ తీవ్రత 40 డిగ్రీలు దాటుతోంది. అయితే అదే స్థాయిలో విద్యుత్తు వినియోగం కూడా జరుగుతున్నది. సోమవారం ఒక్క రోజే దేశవ్యాప్తంగా గరిష్టంగా 255.85 గిగావాట్ల విద్యుత్తును వినియోగించినట్లు ప్రభుత్వం పేర్కొన్నది. ఎయిర్ కండీషనర్లు, డిజర్ట్ కూలర్లు అధికంగా వాడడం వల్ల విద్యుత్తు వినియోగం కూడా పీక్ స్థాయికి చేరుకున్నది. విద్యుత్తు శాఖ డేటా ప్రకారం సోమవారం సుమారు 256 గిగా వాట్ల విద్యుత్తు వినియోగం జరిగినట్లు తెలిసింది. ఈనెలలో విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరుగుతూ వచ్చింది. ఈ నెల రెండో అర్థభాగం నుంచి విద్యుత్తు మోత మోగుతున్నది. శుక్రవారం రోజు 252.07 గిగావాట్లు, శనివారం ఏప్రిల్ 25వ తేదీన 256.11 గిగావాట్ల వినియోగం జరిగినట్లు ప్రభుత్వం పేర్కొన్నది. అయితే గత ఆదివారం విద్యుత్తు వినియోగం తగ్గింది. ఆదివారం 238.15 గిగావాట్ల విద్యుత్తును వినియోగించారు. కమర్షియల్, ఇండస్ట్రియల్ కంపెనీలు ఎక్కువగా సెలువు తీసుకోవడం వల్ల ఆదివారం విద్యుత్తు వినియోగం తగ్గినట్లు అంచనా వేశారు. దీంతో పాటు కొన్ని చోట్లు డస్ట్ స్టార్మ్, వర్షాలు పడడం వల్ల ఆదివారం వినియోగం తగ్గింది. గత ఏడాది అత్యధికంగా విద్యుత్తు వినియోగం జూన్‌లో రికార్డు అయ్యింది. 2025 జూన్‌లో ఓ రోజు గరిష్టంగా సుమారు 242.77 గిగావాట్ల విద్యుత్తును వినియోగించారు. 2024లో గరిష్టంగా 250గిగావాట్ల విద్యుత్తును మే నెలలో వాడారు. ఇక 2023లో సెప్టెంబర్‌లో సుమారు 243.27 గిగావాట్ల విద్యుత్తును వినియోగించారు. ఈ ఏడాది వేసవిలో ఎండలు మండనున్నట్లు ఐఎండీ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది గరిష్టంగా 270 గిగావాట్ల విద్యుత్తు వినియోగం జరిగే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ నిపుణులు చెబుతున్నారు.

# మహిళా బిల్లును ఆమోదించి తీరుతాం

ఏఎం న్యూస్, వారణాసి,ఏప్రిల్28:
పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టడానికి తాము ఎంతగానో ప్రయత్నించామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. కాంగ్రెస్, ఎస్పీ వంటి ప్రతిపక్ష పార్టీల నీచ రాజకీయాల వల్లే ఆ చట్టం అమల్లోకి రాకుండా ఆగిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు అభివృద్ధి చెందడం, అసెంబ్లీలు, పార్లమెంట్‌లకు రావడం ప్రతిపక్షాలకు ఇష్టం లేదని..అందువల్లే 40 ఏళ్లుగా ఈ బిల్లును అడ్డుకుంటూనే ఉన్నారని అన్నారు. తమ తప్పులు కప్పిపుచ్చుకోవడానికి సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా.. మహిళా రిజర్వేషన్ అమలు చేయడానికి కృషి చేస్తూనే ఉంటామన్నారు. వారణాసిలో నిర్వహించిన సభలో ప్రధాని మోదీ ఈ మేరకు ప్రసంగించారు. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయడమనే మహా యజ్ఞం ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నానని.. అందుకు మాతృమూర్తుల ఆశీస్సులు తీసుకునేందుకు వారణాసి వచ్చానని ప్రధాని పేర్కొన్నారు. ఈ బిల్లును తేవడానికి చేస్తున్న ప్రయత్నాల్లో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని..ఇది రాజకీయ పార్టీల కోసం తెచ్చింది కాదని అన్నారు. సాధారణ కుటుంబాల మహిళలు పార్లమెంటు, అసెంబ్లీలకు రావాలని కోరుకున్నానని తెలిపారు. కానీ ప్రతిపక్షాలు మాత్రం అధికారం తమ కుటుంబాలకే పరిమితం కావాలని కోరుకుంటున్నాయని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్లపై తమ పోరాటం ముగిసిపోలేదని, చట్టాన్ని అమలు చేసే వరకు పోరాడుతూనే ఉంటామన్నారు.
నరేంద్ర మోదీ సిక్కిం రాష్ట్ర రాజధాని గ్యాంగ్‌టక్‌లో సందడి చేశారు. యువతతో కలిసి ఫుట్‌బాల్ ఆడుతూ ఉల్లాసంగా గడిపారు. సిక్కిం రాష్ట్ర అవతరణ జరిగి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వేడుకలు జరుగుతున్నాయి. మంగళవారం జరగబోయే ముగింపు వేడుకల కోసం ప్రధాని గ్యాంగ్‌టక్ చేరుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఫుట్‌బాల్ ఆడారు. సిక్కిం 50వ అవతరణ దినోత్సవం సందర్భంగా ఆ రాష్ట్రంలో పర్యటిస్తున్న ప్రధాని మంగళవారం ఉదయం అక్కడి క్రీడాకారులతో కలిసి సరదాగా ఫుట్‌బాల్ ఆడారు. ఈ ఆటకు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. గ్యాంగ్‌టక్‌లో యువ మిత్రులతో కలిసి ఆడడం చాలా ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. ప్రధాని స్పోర్ట్స్ దుస్తుల్లో పిల్లలతో కలిసి ఆనందంగా ఫుట్‌బాల్ ఆడుతున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సిక్కిం 50వ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ ముగింపు కార్యక్రమానికి మోదీ హాజరై.. రూ.4,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ఆవిష్కరించారు. ఆ రాష్ట్రం భారత యూనియన్‌లో చేరి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రోడ్‌షోలో పాల్గొన్నారు. అధికారిక కార్యక్రమాలకు ముందు గ్యాంగ్‌టక్‌లో యువతతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. ఈ సందర్భంగా తీసిన ఫొటోలు, వీడియోలను ప్రధాని తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకోవడంతో అవి వేగంగా వైరల్ అయ్యాయి. యువతతో కలిసి క్రీడల్లో పాల్గొనడం తనకు ప్రత్యేక అనుభూతినిచ్చిందని ప్రధాని పేర్కొన్నారు. 'గ్యాంగ్‌టక్‌లో ఉదయం యువ స్నేహితులతో కలిసి ఫుట్‌బాల్ ఆడడం చాలా ఎనర్జీ ఇచ్చిందని మోదీ పేర్కొన్నారు. కాగా, సిక్కింలో ప్రధాని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయబోతున్నారు. సిక్కింలో రహదారుల కనెక్టివిటీ, ఆరోగ్యం, టూరిజం, విద్య, నగర అభివృద్ధి సహా వివిధ రంగాల్లో రూ.4,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించనున్నారు.



# చర్లపల్లి స్టేషన్ వద్ద భూమి కేటాయించండి

ఏఎం న్యూస్, హైదరాబాద్,ఏప్రిల్28:
ఆధునీకరించిన చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద సౌకర్యాల కోసం అవసరమైన భూ కేటాయింపులు చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. చర్లపల్లి రైల్వే స్టేషన్ దగ్గర రోడ్లు, పార్కింగ్ కోసం భూమి, సికింద్రాబాద్ స్టేషన్ రోడ్డు విస్తరణ గురించి లేఖలో ప్రస్తావించారు. చర్లపల్లి స్టేషన్ దగ్గర రోడ్లు ఇరుకుగా ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని.. వాటిని విస్తరించాలని కోరారు. పార్కింగ్ కోసం స్టేషన్ దగ్గర అదనంగా 5 ఎకరాల భూమి కావాలన్నారు. అలాగే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద కూడా రోడ్లు ఇరుకుగా ఉన్నాయని.. విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఎం స్వయంగా వీటిపై దృష్టి సారించాలని కోరారు.

# నేడు బెంగాల్లో రెండోదశ పోలింగ్

ఏఎం న్యూస్, కోల్‌కతా,ఏప్రిల్28:
పశ్చిమ బెంగాల్‌లో బుధవారం జరగనున్న రెండో దశ పోలింగ్‌కు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సమస్యాత్మక ప్రాంతాల్లో భారీగా భద్రతను మోహరించింది.రాష్ట్రంలో మొత్తం 294 శాసనసభ స్థానాలకు గాను 152 చోట్ల తొలి దశలో ఈ నెల 23న పోలింగ్ పూర్తయ్యింది. మిగిలిన 142 స్థానాల్లో బుధవారం రెండో దశ పోలింగ్ జరగనుంది. ఈ 142 స్థానాల్లో గత ఎన్నికల్లో టీఎంసీనే 123 చోట్ల విజయం సాధించగా.. భాజపా 18, ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ ఒకచోట గెలిచాయి. అయితే, పోలింగ్‌కు కొన్ని రోజుల ముందు రాష్ట్రంలో నాటుబాంబులు లభించడం, స్వల్ప పేలుడు ఘటనల నేపథ్యంలో ఈసీ అప్రమత్తమైంది. కార్యకర్తలను లక్ష్యంగా చేసుకోవడం, ఓటింగ్‌కు అంతరాయం కలిగించేందుకు దుండగులు బాంబులను ఉపయోగించే ప్రమాదం ఉందని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏకు సూచించింది. రాష్ట్రంలో పోలింగ్ రోజున, పోలింగ్ తర్వాత ఎటువంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. దక్షిణ పరగణాలు జిల్లాలోని భాంగర్ ప్రాంతంలో ఇటీవల ఓ ఇంట్లో అనేక నాటు బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన ఎన్ఐఏ, ముమ్మర దర్యాప్తు చేపట్టింది.

# సిసి కెమరాలను సైతం హ్యాక్ చేస్తున్నారు

ఏఎం న్యూస్, సంగారెడ్డి,ఏప్రిల్ 28 :
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రేవంత్ మూర్ఖత్వం.. హిట్లర్‌ను మించిపోయిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌పై దాడి కేసులో జైల్లో ఉన్న బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నే క్రిశాంక్‌ను హరీశ్ పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొంత మంది ఐపీఎస్‌లు తమ ఫోన్‌లను.. ఇంటి ముందున్న సిసి కెమెరాలను హ్యాక్ చేస్తున్నారని ఆరోపించారు. బెంగళూరు నుంచి హ్యాకర్లను తీసుకొచ్చి తమపై నిఘా పెడుతున్నారన్నారు. 'అలాంటి అధికారులు జాగ్రత్త.. మీరు రిటైర్డ్ అయినా మిమ్మల్ని వదలం' అని హెచ్చరించారు. మన్నే క్రిశాంక్‌తో పాటు ఏడుగురిపై అక్రమ కేసు పెట్టారని మాజీ మంత్రి మండిపడ్డారు. ప్రశ్నించే వారిపై కాంగ్రెస్ అక్రమ కేసులు పెడుతోందని ఆరోపించారు. రైతులు, రాష్ట్ర ప్రజల పట్ల కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. ఎవరు మాట్లాడితే వాళ్లపై కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీపై అక్రమ పోస్టులు పెడుతున్నారని పోలీసులకు క్రిశాంక్ ఫిర్యాదు చేశారని తెలిపారు. కాంగ్రెస్ వాళ్లపై కేసులు పెట్టాల్సింది పోయి ఫిర్యాదు చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు పెట్టారని మండిపడ్డారు. నాన్ బెయిలబుల్ కేసు ఎలా పెడతారని ప్రశ్నించారు. బెయిల్ ఇవ్వాల్సిన కేసును పాత కేసులు చూపెట్టి జైల్లో వేశారని ఆరోపించారు. ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నిస్తే కేసు పెడతారా అని మాజీ మంత్రి హరీశ్ రావు నిలదీశారు.

# ప్రపంచానికి సవాల్‌గా మారిన ఉగ్రవాదం

ఏఎం న్యూస్, న్యూఢిల్లీ,ఏప్రిల్28:
ఉగ్రవాదమే ప్రపంచానికి ప్రధాన ముప్పుగా మారిందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. తీవ్రవాదం, ఉగ్రవాదంతో పలు సమస్యలు ఎదుర్కొంటున్నామని చెప్పారు.ఉగ్రవాదం పై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే దేశాలు అందుకు తగిన పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. కిర్గిస్థాన్ లో జరిగిన షాంఘై సహకార సంస్థ రక్షణ మంత్రుల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గత ఏడాది జమ్ముకశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడి గురించి రాజ్‌నాథ్ సింగ్ ప్రస్తావించారు. పహల్గామ్ ఉగ్రదాడి ఘటన యావత్ మానవాళిని కుదిపేసిందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఆ దాడి అనంతరం 'ఆపరేషన్ సింధూర్ చేపట్టి ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా తప్పించుకోలేరని భారత్ నిరూపించిందని తెలిపారు. ఈ సందర్భంగా పాకిస్థాన్ పేరు ప్రస్తావించకుండా ప్రభుత్వ మద్దతుతో జరిగే సీమాంతర ఉగ్రదాడులను అస్సలు విస్మరించకూడదని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలకు తావులేదని అన్నారు. ఉగ్రవాదులకు సాయపడుతూ ఆశ్రయం కల్పించేవారిపై చర్యలు తీసుకోవడంలో ఎస్‌సీవో వెనకాడకూడదని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షోభం గురించి కూడా ఆయన మాట్లాడారు. గత కొన్నేళ్లుగా జరిగిన వరుస ఘర్షణల్లో అనేకమంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, భారీ ఆస్తి నష్టం కూడా వాటిల్లిందని చెప్పారు. ఉగ్రవాద బెదిరింపులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఆయన నొక్కి చెప్పారు. ఈ క్రమంలో ఉద్రిక్తతల పరిష్కారానికి దౌత్య మార్గాలను అనుసరించాలన్నారు.

# తెలంగాణ డిజిపిగా సివి ఆనంద్

ఏఎం న్యూస్, హైదరాబాద్,ఏప్రిల్28:



తెలంగాణ కొత్త డీజీపీగా సీవీ ఆనంద్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. యూపీఎస్సీ ఎంపానెల్ సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. ప్రస్తుతం సీవీ ఆనంద్ హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఆయన డీజీపీగా ప్రమోషన్ పొందనున్నారు. ఈ బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఈ నియామకం అమల్లోకి వస్తుంది. తెలంగాణ ప్రస్తుత డీజీపీ కె. శివధర్ రెడ్డి ఈనెల 30వ తేదీన ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ పోలీస్ బాస్‌గా సీవీ ఆనంద్ నియమితులయ్యారు. ఏప్రిల్ నెలాఖరులో ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి పదవి విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో కొత్త డీజీపీ ఎంపిక అనివార్యమైంది. అందుకు రాష్ట్రంలోని సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్లు జాబితాను ఇటీవల యూపీఎస్సీ.. రాష్ట్ర ప్రభుత్వం పంపింది. ఆ జాబితాలో 1991 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్‌తోపాటు 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్యా మిశ్రా ఉన్నారు. వారిలో సీనియర్ అయిన సీవీ ఆనంద్‌ను రాష్ట్ర ప్రభుత్వం కొత్త డీజీపీగా ఎంపిక చేసింది.

# గ్రామంలో ఉన్న సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తాం

## - సిపిఎం నాయకులు....



ఏఎం న్యూస్ / యాదగిరిగుట్ట : మండలం పెద్ద కందుకూరు గ్రామంలో అనేక సమస్యలు నెలకొని ఉన్నాయని వాటిని తక్షణమే పరిష్కరించకపోతే సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని సిపిఎం పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం అన్నారు. మంగళవారం పెద్ద కందుకూరు గ్రామంలోని సిపిఎం పార్టీ కార్యాలయం వద్ద ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామంలో పారిశుద్ధ సమస్య, మంచినీటి కొరత ఉందని, ఫిల్టర్ను నిర్వహించడం లేదని, పాలకవర్గం పట్టించుకోవడంలేదని అన్నారు. నూతన పాలకవర్గం ఏర్పడి నాలుగు నెలలు అవుతున్న గ్రామంలో ఎలాంటి సమస్యలు తీరలేదని సౌకర్యాలు మెరుగు పడలేదని విమర్శించారు. అనేకమంది గ్రామంలో అనారోగ్యంతో ఆసుపత్రుల పాలు అవుతున్నారని అన్నారు. గ్రామానికి 12 ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనప్పటికీ వాటిని అర్హులకు ఇవ్వలేదని విమర్శించారు. గ్రామంలో ఇంకా 50 మంది ఇందిరమ్మ ఇండ్లకు అర్హులైన పేదవాళ్లు ఉన్నారని వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాలకవర్గం ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చడం లేదని విమర్శించారు. గతంలో సిపిఎం పార్టీ తరపున సర్పంచ్ అభ్యర్థి రెండుసార్లు గ్రామంలో పాలన చేశారని ఆ సమయంలో ప్రతి సమస్యను నెరవేర్చాలని అన్నారు. ఆ సమయంలో గ్రామంలో పండుగలు నిర్వహించిన సందర్భంలో ఎవరి నుండి ఒక్క రూపాయి కూడా వసూలు చేయలేదని అన్నారు. కానీ ప్రస్తుత పాలకవర్గం గుడి నిర్మాణం పేరుతో భారీ ఎత్తున చందాలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఎవరికి వారే చందా బుక్కులు ప్రింట్ చేయించుకొని తిరుగుతున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై పాలకవర్గం వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. గ్రామంలో తక్షణమే సమస్యలు పరిష్కరించకపోతే సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు, ఉద్యమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ సిపిఎం మండల కార్యవర్గ సభ్యులు భీమ గాని రాములు గౌడ్, కాల్నే స్వామి , కాల్నే వెంకటేష్, వార్డు సభ్యులు కాల్నే స్రవంతి రాజు , జాగిల్లాపురం వనజ, వెంకటేష్, నీలం శ్రీనివాస్, జోగు శ్రీనివాస్, కాల్నే సిద్ధులు, జమ్మూ సిద్ధులు, కాల్నే స్వామి , గుర్రం రామచందర్, జమ్ము శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై బి.ఆర్.ఎస్.వి పోస్టు కార్డు ఉద్యమం

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



బిఆర్ఎస్వి రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు బిఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వంత్ కుమార్ ఆధ్వర్యంలో ఫీజుల కొరకు కాంగ్రెస్ ప్రభుత్వం పై బి.ఆర్.ఎస్.వి పోస్టు కార్డు ఉద్యమం చేపట్టింది. మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లాలో డిగ్రీ మరియు ఇంజినీరింగ్ కళాశాల వివిధ శాఖల్లో విద్యార్థులను కలసి, పెండింగ్లో ఉన్న ఫీ రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వం పై పోస్ట్ కార్డు ఉద్యమం నిర్వహించబడింది. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ ఫీజులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ పోరుబాట కార్యక్రమానికి విద్యార్థులు పోరాటానికి మద్దతు పలికారు. ఇందులో బి.ఆర్.ఎస్.వి నాయకులు అఖిల్,రాజు యాదవ్, ప్రవీణ్ నాయక్, రవి కిరణ్, , జై కృష్ణ, స్టాలిన్, దయాకర్, హరీష్, సాయి గౌడ్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంక్లో బారులు తీరిన వాహనదారులు



ఏ ఎం న్యూస్, ఓయూ: పెట్రోల్ కొరత ఏర్పడి రానున్న రోజుల్లో బంక్లు మూతపడతాయని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడంతో వాహన దారులంతా ఒక్కసారిగా పెట్రోల్ బంక్ల దారి పట్టారు. మంగళవారం ఉదయం నుంచి తార్నాక, లాలాపేట, ఓయూ రోడ్డులోని పలు పెట్రోల్ బంక్ల వద్ద వందల సంఖ్యలో వాహనాలు బారులు తీరాయి. వాహనదారులు ఫుల్ ట్యాంక్ పెట్రోల్ పోయించుకునేందుకు పోటీ పడ్డారు. ద్విచక్ర వాహనాలు, క్యాబ్లు, ఆటోలు, కార్లు క్యూ లైన్ కట్టడంతో ఓయూ ఆడిక్మెట్ రోడ్డులో ట్రాఫిక్ జాం నెలకొంది. ట్రాఫిక్ పోలీసులు బంక్ వద్దకు చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేయడానికి కష్టపడాల్సి వచ్చింది. వందతులను నమ్మొద్దు.. తార్నాకలోని పెట్రోల్ బంక్ల వద్ద స్థానిక కాంగ్రెస్ నాయకులు మంత్రి ప్రవీణ్ కుమార్ వాహనదారులతో మాట్లాడారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వందతులను నమ్మవద్దని సూచించారు. ఎండాకాలం ఎండలు మండిపోతున్నాయి..ఈ క్రమంలో పెట్రోల్ ఫుల్ ట్యాంక్ చేసుకుని, డబ్బాల్లో, క్యాన్లలో పెట్రోల్ నిలువ చేసుకుని ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దనీ అవగాహన కల్పించారు. ఎవరికి ఎంత అవసరమో అంతే మోతాదులో పెట్రోల్, డీజిల్ పోసుకోవాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ నేతికార్ మహేశ్ తదితరులున్నారు.

## డాక్టరేట్ సాధించిన రైతు కూలీ బిడ్డ రామగిరి శేఖర్



ఏ ఎం న్యూస్, ఓయూ: మంచిర్యాల జిల్లాలోని మందమర్రి మండలంలోని సారంగపల్లి గ్రామంలోని రైతు కూలీ కుటుంబానికి చెందిన రామగిరి లింగయ్య - రత్న ల పెద్దకొడుకు శేఖర్ తల్లితండ్రుల కష్టాన్ని చూసి చలించి ఉన్నత చదువులకోసం సారంగపల్లి ఊరు నుంచి హైదరాబాద్ లోని ఉస్మానియా యూనివర్సిటీ వరకు చేరుకొని బిజినెస్ మేనేజ్మెంట్లో పీఎచ్డి సీటుని సాధించి, ప్రొఫెసర్ డా.ఆర్.వెంకటేశ్వర్ రావు పర్యవేక్షణలో ది రోల్ ఆఫ్ కన్స్యూమర్ డ్యూరబుల్ ఫైనాన్స్ ఇన్ ఎలక్ట్రానిక్స్ రిటైల్ ఇన్ హైదరాబాద్ అనే అంశంపై పరిశోధన పూర్తి చేసుకొని డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా డా. రామగిరి శేఖర్ కు పలువురు ప్రొఫెసర్లు, విద్యార్థులు అభినందనలు తెలిపారు. 100 సంవత్సరాల చరిత్ర గల ఉస్మానియా యూనివర్సిటీలో పీఎచ్డి పరిశోధన పూర్తి చేసుకొని డాక్టరేట్ పట్టా పొందడం ఎంతో సంతోషకరమని శేఖర్ తెలిపారు. పీఎచ్డి పరిశోధనలో మార్గదర్శకులు ప్రొఫెసర్ డా.ఆర్.వెంకటేశ్వర్లు ప్రోత్సహించి పరిశోధన దిగ్విజయంగా పూర్తి చేయటానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్తో పాల్గొన్న ఎస్.శివ శంకర్



ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్ గూడ మహమ్మద్ ఫంక్షన్ హాల్లో (వివిధ డివిజన్లోని మొత్తం 325 మంది లబ్ధిదారులకు రూ.3,25, 37,700) విలువైన షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి పథకాల చెక్కులను (ఎర్రగడ్డ డివిజన్లోని 18 చెక్కులు తో కలిపి) జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ కన్వీనర్ ఎస్సీ, డిపార్ట్మెంట్ సికింద్రాబాద్ డిస్టిక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ శివశంకర్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్ తో పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు తన చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం పేద మధ్యతరగతి కుటుంబాల ఆడపడుచుల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు ఆర్ ఐ రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వివిధ హోదాల రాజకీయ నాయకులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాల్లు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## 325 లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :



జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్గూడ మహమ్మద్ ఫంక్షన్ హాల్లోమా ష్ట్రుజూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్ నగర్ డివిజన్ 138, వెంగల్రావ్ నగర్ 38, యూసుఫ్గూడ బస్తి 22, బోరబండ 109, ఎర్రగడ్డ 18 మంది కలిపి మొత్తం 325 మంది లబ్ధిదారులకు రూ.3,25, 37,700 విలువైన షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాల చెక్కులను జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద మరియు మధ్యతరగతి కుటుంబాల ఆడపడుచుల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు ఆర్ ఐ రాజిరెడ్డి, వనం సంగీత శ్రీనివాస్ యాదవ్, భవాని శంకర్, నాగార్జున రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సాయినాథ్ యాదవ్కు ఆహ్వాన పత్రిక అందజేసిన హనుమాన్ విగ్రహ సమితి నిర్వాహకులు

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :



మూడు రోజులు (ఏప్రిల్ 29, 30, మార్చి 1 సాయంత్రం వరకు జరిగే) జరిగే పూజా కార్యక్రమాల్లో పాల్గొని, ఆంజనేయస్వామి వైభవ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవంలో (కుషాయిగూడ 54 అడుగుల భారీ హనుమాన్ విగ్రహావిష్కరణ) పాల్గొనండి అని జూబ్లీహిల్స్ నియోజకవర్గం డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాయినాథ్ యాదవ్కు ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానం పలికారు కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్, బజరంగ్ దళ్ నిర్వాహకులు.

## బహుజనుల ఐక్యతే రాజ్యాధికారానికి మార్గం

# పూలే అంబేద్కర్ ఆశయాలతో ఉద్యమానికి నాంది

### ఓయూలో ఘనంగా మహనీయుల జయంతి ఉత్సవం




ఏ ఎం న్యూస్, ఓయూ: వెనుకబడిన కులాల సమాఖ్య (బిసిఎఫ్), బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం (బీసీఐఎఫ్), దళిత్ బహుజన్ స్టూడెంట్ అసోసియేషన్ (డిబిఎస్ఏ), 42% బీసీ రిజర్వేషన్ పోరాట సమితి, ఏఐఓబీసీఎస్ఎఫ్, సబ్బండ శక్తి, పి.డి.ఎస్.యూ జార్జిరెడ్డి, బీసీ జేఏసీ, తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ యువజన జేఏసీ ఆధ్వర్యంలో వివిధ విద్యార్థి సంఘాల సమక్షంలో ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల, రూమ్ నెంబర్ 57లో పూలే--అంబేద్కర్ మహనీయుల జయంతోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెనుకబడిన కులాల సమాఖ్య (బిసిఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు ఎన్. చెన్న రాములు సభాధ్యక్షత వహించారు. 42% బీసీ రిజర్వేషన్ పోరాట సమితి కో-ఆర్డినేటర్ డా. అవ్వారు వేణుకుమార్ స్వాగతోపన్యాసం చేశారు. డిబిఎస్ఏ రాష్ట్ర కో-ఆర్డినేటర్ జంగిలి దర్శన్ సభ లక్ష్యాలు మరియు తీర్మానాలను వివరించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం (బీసీఐఎఫ్) చైర్మన్ టీ. చిరంజీవులు పాల్గొని మాట్లాడుతూ, నాటికి 85% ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు ఏకమైతేనే రాజ్యాధికారాన్ని సాధించగలమని పేర్కొన్నారు. అలాగే 42% బీసీ రిజర్వేషన్ల సాధన, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ, యువతలో నాయకత్వాభివృద్ధి, వంటి లక్ష్యాలతో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. విశిష్ట అతిథులుగా హాజరైన హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ, బహుజన సమాజ ఐక్యతే రాజ్యాధికార సాధనకు మూలాధారం అని పేర్కొన్నారు. ఓయూ ప్రొఫెసర్ రాం షెఫర్డ్ మాట్లాడుతూ, మహాత్మా పూలే మరియు డాక్టర్ అంబెద్కర్ ను సరిగ్గా అర్థం చేసుకుంటేనే నిజమైన సామాజిక మార్పు మరియు రాజ్యాధికార సాధ్యం అవుతుందని తెలిపారు. డిబిఎస్ఏ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ నలిగంటి శరత్ చమార్ మాట్లాడుతూ, మహనీయుల స్ఫూర్తితో బహుజన సమాజం ఏకమై ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొ.కొండ నాగేశ్వర్ రావు, ప్రొ. రాములు, దాసోజు లలిత,ముల్కలపల్లి సంగమేశ్వర రావు, సురేష్ మహాజన, విద్యార్థి సంఘాల నాయకులు ఆర్. ఎల్. మూర్తి, కొమ్ము శేఖర్ మాదిగ, వలిగొండ నర్సింహా, ఎస్. నాగేశ్వరరావు, కాసర్ల మధు, సుమంత్, ఉదయ్, వంశీ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బాలానగర్లో ఘనంగా హిందూ సమ్మేళనం

### - ఐదు వేల మందికి పైగా హాజరు..



ఏ ఎం న్యూస్, కూకట్పల్లి : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసాపేట సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని ప్రాంతంలో హిందూ ఐక్యతకు ప్రతీకగా నిలిచేలా నిర్వహించిన హిందూ సమ్మేళన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. బాలానగర్ జై శ్రీరామ్ జాక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ మహాసభకు దాదాపు 5,000 మంది హిందూ సోదరులు, సోదరీమణులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మొదటిసారిగా బాలానగర్ వేదికపై ఈ స్థాయిలో హిందూ బంధువులందరూ ఒకే చోట చేరడం విశేషంగా నిలిచింది. ఈ సమ్మేళనం ఆధ్యాత్మికతతో పాటు సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించింది. రంగురంగుల సాంస్కృతిక కళారూపాలు, నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించగా, సామూహికంగా నిర్వహించిన హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమానికి భక్తి మాధుర్యాన్ని చేకూర్చింది. పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక ఆనందంలో మునిగిపోయారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ శ్రీ ఆదిత్య పరశ్రీ స్వామీజీ ఆధ్యాత్మిక ప్రవచనాలు సభలో ఉన్నవారిని ఆలోచింపజేస్తూ భక్తి మార్గంలో నడిచేలా ప్రేరేపించాయి. అలాగే అఖిల భారత గో సేవ ఫౌండేషన్కు చెందిన శ్రీ బాలకృష్ణ గురుస్వామి గోసంరక్షణ ప్రాముఖ్యతపై ఇచ్చిన సందేశం ప్రజల్లో చైతన్యాన్ని కలిగించింది. ఈ మేరకు తెలంగాణ ప్రాంత నిర్వాహకులు కాచం రమేష్ సమాజంలో ఐక్యత, సేవాభావం అవసరాన్ని వివరించగా, తెలంగాణ సామాజిక కార్యకర్త రుక్మిదేవి సందేశం మహిళల పాత్ర, సమాజ నిర్మాణంలో వారి బాధ్యతలను స్పష్టంగా చేశారు. మొత్తంగా ఈ హిందూ సమ్మేళనం బాలానగర్ ప్రాంతంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు, హిందూ సమాజ ఐక్యతకు బలమైన వేదికగా నిలిచింది.

## ప్రతి పేదవాడి ఆకాంక్షను నెరవేర్చేలా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం

### - టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



పేదవాడి ఆకాంక్షను నెరవేర్చేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల 32 ప్రధాన డిమాండ్లను ఏకకాలంలో అంగీకరించి ఆమోదించినందుకు, సమ్మె విరమింప చేసినందుకు కృతజ్ఞతగా మంగళవారం కేపీహెచ్బీ కాలనీ బస్టాండ్ వద్ద కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో కార్మికులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బండి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సమ్మె సందర్భంగా ఆత్మహత్య చేసుకున్న శంకర్ గౌడ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బండి రమేష్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళు అపరిష్కృతంగా ఉన్న ఆర్టీసీ కార్మికుల సమస్యలను కేవలం రెండు రోజుల్లోనే పరిష్కరించి వారి డిమాండ్లకు అంగీకరించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వారి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. గత ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యల పట్ల వెటకార ధోరణితో వ్యవహరించిందన్నారు. శంకర్ గౌడ్ తొందరపాటు నిర్ణయంతో ఆత్మహత్యకి పాల్పడడం బాధాకరమన్నారు. అతని కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. కార్మికులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి జిందాబాద్ కాంగ్రెస్ పార్టీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు.

## మెరుగు శివకృష్ణ చొరవతో దివ్యాంగురాలికి ఆర్టిఫిషియల్ కుడి చెయ్యి ఏర్పాటు

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



కుత్బుల్లాపూర్కు చెందిన ఆశ అనే మైనారిటీ యువతి పుట్టుకతోనే కుడి చెయ్యి చిన్నగా ఉండటంతో చాలా కాలంగా ఇబ్బందులు ఎదుర్కొంటూ జీవిస్తోంది. రోజువారీ పనుల్లో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్న ఆమెకు సహాయం అందించేందుకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంలో తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర జనరల్ సెక్రటరీ మెరుగు శివకృష్ణ కీలక పాత్ర పోషించారు. సమస్య తెలుసుకున్న వెంటనే స్పందించిన శివకృష్ణ, భారత్ వికాస్ పరిషత్ వికలాంగుల పునర్వసతి కేంద్రం ట్రస్ట్ను సంప్రదించి, ఆశకు ఆర్టిఫిషియల్ రైట్ హ్యాండ్ అందేలా చర్యలు తీసుకున్నారు. శివకృష్ణ చొరవతో జరిగిన ఈ సహాయం వల్ల ఆశ జీవితంలో కొత్త వెలుగు కనిపించింది. ఆమె రోజువారీ పనులు సులభంగా చేసుకునే పరిస్థితి ఏర్పడింది. ఈ సందర్భంగా శివకృష్ణ మాట్లాడుతూ, సమాజంలో ఇంకా ఇలాంటి అవసరంలో ఉన్నవారు చాలామంది ఉన్నారని, దాతలు ముందుకు వచ్చి సహాయం చేయాలని కోరారు. ముఖ్యంగా పేద కుటుంబాలకు చెందిన దివ్యాంగ మహిళలకు విద్య, ఉపాధి, వివాహం వంటి అంశాల్లో ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా దాతలు ముందుకు వస్తే అశ పెళ్లికి ఆర్థిక సాయం చేయవలసిందిగా వికలాంగుల అందరి తరపున మనస్ఫూర్తిగా విజ్ఞప్తి చేస్తున్నాను మీ మెరుగు శివకృష్ణ ఈ కార్యక్రమంలో భారత్ వికాస్ కేంద్రం ట్రస్ట్ మేనేజర్ నరేంద్ర మరియు కూకట్ పల్లి సీనియర్ జర్నలిస్టు నాగరాజు, జినుక రఘు సంధ్య , టెక్నీషియన్ రఘు, మధు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బిజెపి సీనియర్ నాయకులు చౌదరి ధర్మారావు పుట్టినరోజు వేడుకలు...



ఏ ఎం న్యూస్, కూకట్పల్లి : కూకట్పల్లికి చెందిన భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు యువ నేత చౌదరి ధర్మారావు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చౌదరి ధర్మారావు సోదరులు మిత్రులైన హర్వేశ్ రెడ్డి, సాయి సూర్య ఉదయ్ సంతోష్ పృథ్వీల సహకారంతో కూకట్పల్లి గ్రామంలో అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కూకట్పల్లి రామాలయంలో నారసింహా ఇష్టి నారసింహ మండల పూజ కార్యక్రమం

### ఎమ్మెల్యే కృష్ణారావు దంపతులతో కలిసి పాల్గొన్న మాజీ కార్పొరేటర్ రోజా దేవి రంగారావు దంపతులు...



ఏ ఎం న్యూస్, కూకట్పల్లి : కూకట్పల్లిలోని శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానములో కూకట్పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించేటటువంటి శ్రీ గరుడ, హనుమ మూర్తి స్థాపన ప్రయుక్త పాంచాంహ్నిక అష్ట కుండాత్మక శ్రీ రామాయణ మహా యజ్ఞ కార్యక్రమములో భాగంగా మంగళవారం నారసింహా ఇష్టి నారసింహ మండల పూజ కార్యక్రమములో ఎమ్మెల్యే మాధ వరం కృష్ణారావు దంపతులు, మాజీ చైర్మన్ శ్రీనివాసరావు(తులసి రావు)దంపతులతో కలిసి మాజీ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# వరుస సినిమాలతో బాలయ్య బిజీ

## కొరటాల శివతో తదుపరి మూవీ అంటూ ప్రచారం





నందమూరి బాలకృష్ణ మాత్రం తన రూటే సెపరేటు అంటూ పయనిస్తున్నారు. ప్రస్తుతం ఆయన వయసు 66 సంవత్సరాలు. అయినా ఓ వైపు నటునిగా బిజీగా ఉన్నారు. మరోవైపు హిందూపురం ఎమ్మెల్యేగా తన నియోజకవర్గ అభివృద్ధి కోసం శ్రమిస్తున్నారు. అలాగే తన తల్లి పేరిట నెలకొన్న బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ ఛైర్మన్ గానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇంత బిజీగా ఉన్నా ఈ సారి సినిమాల సంఖ్య పెంచాలని యోచిస్తున్నారు బాలయ్య. అందుకు తగ్గట్టుగానే పలువురు దర్శకులు, నిర్మాతలు ఆయనతో సినిమాలు తీయడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఓ సినిమా అయిన తరువాత మరో చిత్రాన్ని లైన్ లో పెడతారు ఎవరైనా. అయితే బాలయ్య ప్రస్తుతం గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ యాక్షన్ ఎంటర్ టైనర్ చేస్తున్నారు.ఆ సినిమా ఓ వైపు షూటింగ్ జరుపుకుంటూ ఉండగానే మరో చిత్రాన్ని లైన్ లో పెట్టనున్నారట బాలయ్య. ఈ మధ్యే బాలకృష్ణకు డైరెక్టర్ కొరటాల శివ ఓ సబ్జెక్ట్ వినిపించారు. ఆ స్జబెక్ట్ బాలయ్యకు ఎంతగానో నచ్చిందని, త్వరలోనే షూటింగ్ మొదలు కానుందనీ సమాచారం. ప్రస్తుతం బాలయ్య హీరోగా గోపీచంద్ మలినేని రూపొందించే చిత్రాన్ని సంక్రాంతికి రిలీజ్ చేసే ప్రయత్నంలో ఉన్నారు. వెంకట సతీశ్ కిలారు ఈ సినిమాను నిర్మిస్తున్నారు.. ఇక బాలయ్యతో కొరటాల శివ రూపొందించే చిత్రానికి సాహు గారపాటి, మిక్కిలినేని సుధాకర్ నిర్మాతలుగా వ్యవహరించనున్నారు. సమాంతరంగా ఈ రెండు చిత్రాల షూటింగ్ జరపనున్నారు. వేసవి పూర్తి కాగానే ఈ రెండు చిత్రాల కోసం డేట్స్ కేటాయించారు బాలకృష్ణ. రెండు సినిమాల్లో ఒకటి సంక్రాంతికి వస్తే, మరోటి ఎప్పుడు వస్తుందనే అనుమానం కలుగక మానదు. రెండు సినిమాలు వచ్చే సంవత్సరమే వెలుగు చూస్తాయని వినిపిస్తోంది. అయితే ఈ యేడాది బాలయ్య సినిమా లేనట్టేనా అని అభిమానులు నిరాశ చెందుతున్నారు. నిజానికి బాలయ్య–గోపీచంద్ మలినేని చిత్రాన్ని ఈ యేడాదే దసరా కానుకగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు. కథలో మార్పులు జరగడం, క్యాస్టింగ్ లోనూ ఛేంజెస్ చోటు చేసుకోవడంతో బాలయ్య–గోపీచంద్ మలినేని మూవీ సంక్రాంతికి షిఫ్ట్ అయింది. మరి బాలయ్య – కొరటాల శివ మూవీ ఎప్పుడు ఎలా ప్రేక్షకులను పలకరిస్తుందో చూడాలి.

## మా ఇంటి బంగారం ప్రమోషన్స్ ఇంకా మొదలు పెట్టని నటి సమంత



ఈ మధ్య కాలంలో ప్రేక్షకులను మెప్పించడం చాలా కష్టంగా మారింది. ఒకప్పుడు స్టార్ హీరో, స్టార్ హీరోయిన్ సినిమా వస్తోంది అంటే చాలు.. అది ఎలా ఉన్నా కూడా ఫ్యాన్స్ హిట్ చేసేవారు. కానీ, ఇప్పటి జనరేషన్ అలా కాదు. ఎంత పెద్ద స్టార్ అయినా సరే కంటెంట్ ఉంటేనే హిట్ చేస్తు న్నారు. కంటెంట్ తో పాటు ప్రమోషన్స్ ని కూడా లెక్కలోకి తీసుకుంటున్నారు. అందుకే ఈ మధ్య స్టార్ హీరోలు సైతం సరికొత్తగా ప్రచారాలు చేస్తూ తమ సినిమాను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. అయితే తాజాగా స్టార్ హీరోయిన్ సమంత మాత్రం తన సినిమాను ప్రజల్లోకి తీసుకెళ్ళలేకపోయారు అని టాక్ నడుస్తోంది. టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత నటిస్తోన్న తాజా చిత్రం మా ఇంటి బంగారం. నందినిరెడ్డి దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రాన్ని సామ్ భర్త రాజ్ నిడిమోరు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్, సాంగ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకు న్నాయి. మే 15 న ఈ చిత్రం రిలీజ్ కు సిద్ధమవుతోంది. రిలీజ్ ఇంకా పట్టుమని 15 రోజులు కూడా లేదు.. కానీ, ఇప్పటివరకు ఈ సినిమా ప్రమోషన్స్ మొదలుపెట్టలేదు. ఒకప్పుడు సామ్ సినిమా రిలీజ్ అంటే ఆ బజ్ వేరే లెవెల్ లో ఉండేది. కానీ, ఇప్పుడు అలా లేదు. రాజ్ నిడిమోరుతో పెళ్ళి తరువాత సామ్ ఒకపక్క నిర్మాతగా.. ఇంకోపక్క హీరోయిన్ గా చేస్తున్న సినిమా మా ఇంటి బంగారం. ఓ బేబీ లాంటి హిట్ తరువాత సామ్–నందినిరెడ్డి కాంబోలోవస్తోన్న చిత్రం కావడంతో ఓ రేంజ్ లో బజ్ ఉంటుంది అనుకున్నారు. అయితే సామ్ మాత్రం ప్రమోషన్స్ చేయడంలో విఫలమయ్యారు అని చెప్పొచ్చు. ఇప్పటివరకు ఈ సినిమా నుంచి ఒక్క ప్రమోషన్ ఇంటర్వ్యూ తప్ప ఇంకేమి రాలేదు. వెన్నెల కిషోర్ – సామ్ ఇంటర్వ్యూ రిలీజ్ అయినా కూడా అదేమీ అంతగా ఆసక్తి రేకెత్తించలేదు అని టాక్. అందుకనే ప్రేక్షకులు సైతం మా ఇంటి బంగారం సినిమాను పట్టించుకోవడం లేదని అంటున్నారు. మరి ఇప్పటికైనా సామ్ ప్రమోషన్స్ ను వేగవంతం చేసి ప్రేక్షకుల్లో ఆసక్తి కలిగించకపోతే సినిమాపై ఆశలు వదులుకోవాల్సిందే అని పలువురు చెప్పుకొస్తున్నారు.

## పండుగాడి జర్నీకి 20 ఏళ్లు పోకిరీ విడుదలై సరిగ్గా రెండు దశాబ్దాలు



తెలుగు చలనచిత్ర చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖించి, బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ సృష్టించిన 'పోకిరి' చిత్రం సరిగ్గా 20 వసంతాలను పూర్తి చేసుకుంది. సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం ఇదే రోజున 2006 ఏప్రిల్ 28న విడుదలైన ఈ సినిమా, అప్పటి వరకు ఉన్న తెలుగు సినిమా బాక్సాఫీస్ లెక్కలను పూర్తిగా మార్చివేసింది. ఈ చిత్రం సూపర్ స్టార్ మహేష్ బాబును మాస్ ప్రేక్షకులకు అత్యంత చేరువ చేయడమే కాకుండా, ఆయనను తిరుగులేని పవర్‌హౌస్‌గా నిలబెట్టింది. డైనమిక్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ మార్క్ మేకింగ్, పదునైన సంభాషణలు మరియు మహేష్ బాబు అల్ట్రా మోడ్రన్ లుక్ కలిసి వెండితెరపై ఒక మ్యాజిక్ చేశాయి. దాదాపు రూ.12 కోట్ల పరిమిత బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం, ఏకంగా రూ.66 కోట్లకు పైగా వసూళ్లను సాధించి అప్పట్లో 'ఇండస్ట్రీ హిట్'గా రికార్డు సృష్టించింది. కేవలం వసూళ్ల పరంగానే కాకుండా, సాంకేతికంగానూ ఈ చిత్రం సరికొత్త ప్రమాణాలను నెలకొల్పింది. ముఖ్యంగా మణిశర్మ అందించిన అద్భుతమైన సంగీతం, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ప్రతి థియేటర్లో వైబ్రేషన్స్ పుట్టించాయి. హీరోయిన్ ఇలియానాకు ఈ సినిమా ఓవర్ నైట్ స్టార్‌డమ్ తీసుకురాగా, విలన్‌గా ప్రకాష్ రాజ్ నటన సినిమాకు ప్రాణం పోసింది. సినిమా ప్రథమార్థం అంతా పండుగాడు అనే ఒక సాధారణ లోకల్ రౌడీగా కనిపించిన మహేష్ బాబు, క్లైమాక్స్ వచ్చేసరికి కృష్ణ మనోహర్ అనే అండర్ కవర్ ఐపీఎస్ ఆఫీసర్ అని రివీల్ అయ్యే సీన్ ప్రేక్షకులకు ఊహించని థ్రిల్ ఇచ్చింది. ఈ ఒక్క ట్విస్ట్ అప్పట్లో థియేటర్లలో సంచలనం సృష్టించడమే కాకుండా, సినిమాను మళ్ళీ మళ్ళీ చూసేలా ప్రేక్షకులను ప్రోత్సహించింది. 'ఎవడు కొడితే దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ అవుతుందో వాడే పండుగాడు', 'ఒకసారి కమిట్ అయితే నా మాట నేనే వినను' వంటి డైలాగులు నేటికీ తెలుగు ప్రేక్షకుల నాలుకలపై నానుతూనే ఉన్నాయి. ఈ సినిమా క్రేజ్ కేవలం టాలీవుడ్‌కే పరిమితం కాకుండా, తమిళంలో విజయ్ హీరోగా, హిందీలో సల్మాన్ ఖాన్ హీరోగా, కన్నడలో దర్శన్ హీరోగా రీమేక్ అయ్యి అక్కడ కూడా ఘనవిజయాలను అందుకుంది. 'పోకిరి' 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహేష్ బాబు అభిమానులు సోషల్ మీడియాలో భారీ ఎత్తున వేడుకలు జరుపుకుంటున్నారు.

Mana Cinemalu

## మైఖేల్ మూవీ వసూళ్ల సునామీ



దివంగత పాప్ స్టార్ మైఖేల్ జాక్సన్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన ప్రతిష్టాత్మక బయోపిక్ 'మైఖేల్' బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తోంది. విడుదలైన అతి తక్కువ కాలంలోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రికార్డులను తిరగరాస్తూ అంతర్జాతీయ స్థాయిలో సెన్సేషన్ సృష్టిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా దాదాపు రూ.2000 కోట్లు మిలియన్ల మార్కుకు చేరువలో ఉండగా, భారత మార్కెట్‌లోనూ మైఖేల్ జాక్సన్‌కు ఉన్న తిరుగులేని క్రేజ్‌ను చాటుతూ రూ.20 కోట్ల భారీ వసూళ్లను సాధించింది. కింగ్ ఆఫ్ పాప్ మ్యూజిక్, ఐకానిక్ డ్యాన్స్ మూమెంట్స్ మరియు ఆయన జీవితంలోని లోతైన సంఘర్షణలను దర్శకుడు ఆంటోనీ ఫుక్వా వెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించడంతో అంతర్జాతీయ ప్రేక్షకులతో పాటు భారతీయ ప్రేక్షకులు కూడా ఈ చిత్రానికి బ్రహ్మరథం పడుతున్నారు. ముఖ్యంగా మైఖేల్ జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ టైటిల్ పాత్రలో ఒదిగిపోయిన తీరుపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఆయన బాడీ లాంగ్వేజ్ మరియు డ్యాన్స్ విన్యాసాలు చూస్తుంటే సాక్షాత్తు మైఖేల్ జాక్సనే మళ్లీ తిరిగి వచ్చారా అన్నట్లుగా ఉందని విమర్శకులు సైతం కొనియాడుతున్నారు.

## లుక్ టెస్ట్ పూర్తయ్యింది చిరు -బాబీ కాంబినేషన్‌లో మూవీ



అగ్ర కథానాయకుడు చిరంజీవి ఫుల్ జోష్‌లో ఉన్నారు. వరుస చిత్రాలతో అలరించేందుకు సిద్ధమవుతోన్న ఆయన తాజాగా కొత్త ప్రాజెక్ట్‌కు సంబంధించిన లుక్ టెస్ట్‌ను పూర్తి చేశారు. బాబీ దర్శకత్వంలో చిరంజీవి హీరోగా రెండో సినిమా రానున్న విషయం తెలిసిందే. మెగా 158గా ఇది ప్రచారంలో ఉంది. ఈ సినిమా అప్‌డేట్‌ను దర్శకుడు పంచుకున్నారు. ఈ రోజు లుక్‌టెస్ట్ పూర్తయిందని..త్వరలోనే షూటింగ్ ప్రారంభించేం దుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. చిరు ఫొటోషూట్‌కు సంబంధించిన ఫొటోను షేర్ చేస్తూ 'హింసకు ముందు నిశ్శబ్దం' అనే క్యాప్షన్ రాశారు. దీంతో భారీ స్థాయి యాక్షన్ చిత్రంగా ఇది రానున్నట్లు తెలుస్తోంది. చిరంజీవి – బాబీ కాంబినేషన్‌లో గతంలో 'వాల్తేరు వీరయ్య' రూపొందింది. 2023లో వచ్చిన ఈ చిత్రం మంచి ఆదరణను సొంతం చేసుకోవడంతో వీరి రెండో సినిమాపై అంచనాలు నెలకొన్నాయి. ఈ ఏడాది 'మన శంకర వరప్రసాద్ గారు'తో హిట్ అందుకున్న చిరంజీవి మూడు సినిమాలతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'విశ్వంభర' ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సోషియో ఫాంటసీ యాక్షన్ థ్రిల్లర్‌తో పాటు శ్రీకాంత్ ఓదెల చిత్రం లైనప్‌లో ఉంది.